
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 16 । నవంబర్ । 2024



సోమశిలలో 69.346 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 69.346 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 5,365 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 50, ఉత్తరకాలువకు 550, కండలేరుకు 3 వేలు, దక్షిణకాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.76,430
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,937
3 శాతం జీఎస్టీతో	రూ.7,145
నవర (8 గ్రా)	రూ.57,160

గరిష్టం/కనిష్టం
31.5 /24.6

వాతావరణం

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం గాలిలో తేమ 95 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ఈ నెలాఖరు వరకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

నెల్లూరు (టౌన్): విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామాలయ, సార్డ్స్, ఎన్జీఓ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ వరకు గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలు, సిబ్బంది జయప్రదం చేయాలన్నారు. క్యాంపెయిన్‌లో మొదటగా 1800–123–6848 నంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. వాట్సప్ నంబరుకు ఒక రిజిస్ట్రేషన్ లింక్ వస్తుందని చెప్పారు. ఆ లింక్‌ను క్లిక్ చేసి అందులో పాఠశాల, హెచ్ఎం పేర్లు, మొబైల్ నంబరు, స్కూల్ మెయిల్ ఐడీ, పాఠశాల విద్యార్థుల సంఖ్య తదితర వివరాలను పూర్తి చేయాలన్నారు. ఆ తరువాత మరో లింకు వస్తుందని, అందులో స్కూల్ నుంచి కొంతమంది విద్యార్థులతో హ్యాండ్ వాష్ చేసిన ఫొటో ఒకటి అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక డిజిటల్ సర్టిఫికెట్ వస్తుందని, స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ పోటీలకు ఉపయోగపడుతుందన్నారు.

రేపు వెటరన్ మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా వెటరన్ మాస్టర్ క్రీడాకారుల ఎంపికలను ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈ.భాస్కర్‌రెడ్డి, బసవయ్య శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు 30–80 ఏళ్ల లోపు స్త్రీ, పురుషులు అర్హులన్నారు. 100, 400, 800, 1,500, 5,000 మీటర్ల పరుగు పందాలు, హైజంప్, లాంగ్ జంప్, షార్ట్‌పుట్, డిస్కర్స్ త్రో, జావెలిన్‌త్రో, హేమర్‌త్రో, 5 కి.మీ. నడక పోటీల్లో ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు వయస్సు ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఎంపికైన అథ్లెట్స్ డిసెంబర్ 14, 15 తేదీల్లో కృష్ణా జిల్లా గుడివాడలో జరిగే ఆంధ్రప్రదేశ్ వెటరన్ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

జిల్లా అంతటా వర్షాలు

- నగటు వర్షపాతం 27.5 మి.మీ.

నెల్లూరు (అర్బన్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం కొన్ని మండలాల్లో భారీ వర్షాలు కురవగా మిగతా మండలాల్లో మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. అత్యధికంగా గుడ్లూరు మండలంలో 101.4 మి.మీ. వర్షం కురిసింది. అత్యల్పంగా అనంతసాగరంలో 5.4 మి.మీ. వర్షం కురిసింది. జిల్లా సగటు వర్షం 27.5 మి.మీ.గా నమోదైంది. ఉలవపాడు మండలంలో 70.6, కందుకూరు 54.6, వలేటివారిపాళెం 51.8, పొదలకూరు 46.2, ముత్తుకూరు 45.6, వరికుంటపాడు 39.2, దగదర్తి 38.2, జలదంకి 37.8, కావలి 37.2, మనుబోలు 35.4, బోగోలు 35.0, లింగసముద్రం 31.4, దుత్తలూరు 28.8, సీతారామపురం 28.0, ఇందుకూరు పేట 26.8, అనుమసముద్రంపేట 25.4, కొడవలూరు 22.8, విడవలూరు 22.6, కోవూరు 21.4, సంగం 20.2, నెల్లూరు రూరల్ 18.6, అల్లూరు 18.4, తోటపల్లిగూడూరు 17.8, నెల్లూరు అర్బన్ 17.4, రాపూరు 17.2, కలిగిరి 17.0, వింజమూరు 16.2, ఉదయగిరి 14.6, కలువాయి 14.0, మర్రిపాడు 13.4, వెంకటాచలం 12.6, బుచ్చిరెడ్డిపాళెం 11.6, ఆత్మకూరు 8.8, కొండాపురం 7.2, సైదాపురం 7.2, చేజర్లలో 6.2 మి.మీ. కురిసింది.

నేడు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడి జిల్లా పర్యటన

నెల్లూరు రూరల్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ శనివారం జిల్లాలో పర్యటించనున్నట్లు సమాచార పౌరసంబంధాలశాఖ డీడీ సదారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఉదయం 9 గంటలకు నెల్లూరు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గిరిజనులు, గిరిజన సంఘాల నుంచి వినతులు స్వీకరించి, వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశమవుతారు. ఉదయం 10.45 గంటలకు కొడవలూరు మండలం చంద్రశేఖరపురంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థినులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 2 గంటలకు నెల్లూరు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్, ఎస్పీలతో సమావేశమవుతారు. సాయంత్రం 4 గంటలకు మీడియా సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

మనీ ట్రాన్స్‌ఫర్ కేంద్రంలో చోరీ

- రూ.3.50 లక్షలు మాయం

గుడ్లూరు: గుడ్లూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న మనీ ట్రాన్స్‌ఫర్ కేంద్రంలో రూ.3.50 లక్షల చోరీ జరిగిందని నిర్వాహకులు కె.వెంకటేష్ శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం సమయంలో భోజనానికి ఇంటికి వెళ్లే సమయంలో షాపు మూత వేయకుండా వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి షాపు కౌంటర్‌లో నగదు కనిపించ లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ టీవీ ఆధారంగా అనుమానితులను పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.





ఆరనీకుమా ఈ దీపం..
కార్తీక దీపం

కార్తీక దీపం.. కోటిజన్మల పుణ్యఫలం అని వేదాలు.. పురాణాలు చెబుతున్నాయి. హరిహరులకు ప్రీతికరమైన కార్తీకమాసంలో కార్తీక శుద్ధ పౌర్ణమి అత్యంత పవిత్రత, ప్రాశస్త్యం కావడంతో శుక్రవారం జిల్లాలోని శైవక్షేత్రాలు కార్తీక దీపకాంతులతో పరిఢవిల్లాయి. వేకువ నుంచే ఆలయాల్లో ఓం కాలకాలయా.. ఓం రుద్రాయా.. స్తోత్రాలు, ఓం నమఃశివాయ పంచాక్షరి మంత్రాలతో కైలాసవాసుడికి విశేషంగా రుద్రసహిత, పంచామృతాలు, క్షీర, జల, విభూతితో అభిషేకాలు చేశారు. ఉపవాస దీక్షలతో శివనామస్మరణతో భక్తులు ఆలయాల్లో ఉసిరికాయ దీపాలు వెలిగించారు. సాయంత్రం ఆయా క్షేత్రాల్లో వేదపండితులు ఆకాశ దీపాలు జ్వలించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్లు, నెల్లూరు

టెండర్లు.. అభాసుపాలు



- నియమ, నిబంధనల్లో లోపించిన పారదర్శకత
- ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే అత్యంత తక్కువకు కోట్
- అప్పారావుపాళెం, పల్లిపాడు రీచ్‌ల టెండర్ల ఖరారులో అధికారుల అత్యుత్సాహం
- కోవూరులో ఒక విధంగా.. ఆత్మకూరులో మరో విధంగా..
- గతంలో లాటరీ విధానంపై కోర్టుకెళ్లిన కాంట్రాక్టర్లు
- మరోసారి కోర్టు మెట్లెక్కనున్న టెండర్‌దారులు

జిల్లాలో ఇసుక తవ్వకాల టెండర్ల ప్రక్రియలో అధికార యంత్రాంగం దుర్వినియోగానికి పాల్పడుతోంది. టెండర్ల విధివిధానాలు రూపొందించడం నుంచి ఖరారు వరకు పారదర్శకత లోపించడంతో ఈ ప్రక్రియ అభాసుపాలవుతోంది. అధికారుల అత్యుత్సాహం మరోసారి వివాదంగా మారింది. రీచ్.. రీచ్‌కు నిబంధనలు మార్చేసి.. అధికార పార్టీ నేతలకు కట్టబెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఒకసారి కోర్టును ఆశ్రయించిన కాంట్రాక్టర్లు మరోసారి న్యాయస్థానం మెట్లెక్కేందుకు సిద్ధమవుతున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి లేకుండానే ఇసుక తవ్వకాలకు ఇష్టారాజ్యంగా అనుమతులివ్వడమే కాకుండా, అధికార పార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులు ముున్ముందు దోషులుగా నిలిచే పరిస్థితులు అనివార్యమవుతున్నాయి.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లా పరిపాలన యంత్రాంగం ఇసుక టెండర్ల వ్యవహారంలో చేస్తున్న తప్పిదాలు తలబొప్పి కట్టిస్తున్నాయి. పెన్నానదిలో ఇసుక తవ్వకాలు చేపట్టాలంటే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి తీసుకోవాలి. కానీ ఇందుకు విరుద్ధంగా జిల్లా అధికార యంత్రాంగం అత్యుత్సాహంతో పూడిక తీత, యంత్ర రహితంగా ఇసుక తవ్వకాలంటూ ఇష్టారీతిన అధికార పార్టీ నేతలకు కట్టబెట్టుతున్నారు. అసలు టెండర్ల ప్రక్రియకు విధివిధానాలు లేకుండా ఆహ్వానించడం, చివరాఖరుకు ఎమ్మెల్యేలు చెప్పిన వారికే అనుమతి ఇచ్చి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. తాజాగా జిల్లాలో అప్పారావుపాళెం, పల్లిపాడు రీచ్‌లకు సంబంధించి ఈ రెండు చోట్ల రెండు రకాల నిబంధనలు అమలు చేసి టీడీపీ నేతలకే కట్టబెట్టాడం వివాదాస్పదమవుతోంది. గతంలో జిల్లాలోని నాలుగు రీచ్‌లకు సంబంధించి ఇదే రీతిలో అధికారులు వ్యవహరించడంతో కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించారు. తాజా టెండర్ల వ్యవహారంపై కూడా మరోసారి న్యాయస్థానంను ఆశ్రయించేందుకు సమాయత్తమవుతున్నారు.

అప్పారావుపాళెంలో అలా.. పల్లిపాడులో ఇలా..

జిల్లాలో ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం, ఇందుకూరుపేట మండలం పల్లిపాళెంలో ఇసుక రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలకు టెండర్లు ఆహ్వానించారు. రెండు రోజుల క్రితం వాటిని ఓపెన్ చేశారు. ఈ రెండు రీచ్‌లకు సంబంధించి జిల్లాలోని ఓ ఎమ్మెల్యేకు దగ్గరి బంధువు బినామీ పేర్లతో టెండర్లు దాఖలు చేశారు. అప్పారావుపాళెం రీచ్‌లో నాలుగు టెండర్లు బెస్ట్ ప్రైస్ ధరకే కోట్ చేయడంతో ఇక్కడ లాటరీ విధానంతో చివరాఖరుకు సదరు ఎమ్మెల్యే బంధువు కాంట్రాక్ట్ సంస్థ మిలీనియం స్టీల్స్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కే కట్టబెట్టారు. అదే పల్లిపాడులో ఐదుగురు టెండర్లు అర్హత సాధించినా.. బెస్ట్ ప్రైస్ కంటే తక్కువకు కోట్ చేసిన అదే ఎమ్మెల్యే బంధువు బినామీ భరణికుమార్‌కే కట్టబెట్టారు. పేరుకు టెండర్ల ప్రక్రియే.. కానీ చివరికి టీడీపీ నేతలకే కాంట్రాక్ట్ ఖరారు చేయడంలో అధికార యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తోంది.

టెండర్ ధర కంటే తక్కువ ఉండకూడదు

వాస్తవానికి ఇసుక తవ్వకాలకు సంబంధించి అధికార యంత్రాంగం టన్ను లోడింగ్‌కు రూ.25 కనీస ధర ప్రకటించింది. నిర్దేశించిన ధర (బెస్ట్ ప్రైస్) కంటే తక్కువకు ఎవరూ వేయకూడదు. ఒక వేళ ఎక్కువ మంది బ్రెస్ ప్రైస్‌కే కోట్ చేస్తే లాటరీ విధానంలో కేటాయించాలి. కానీ గతంలోనూ, ఇప్పుడూ బెస్ట్ ప్రైస్ కంటే తక్కువ వేసిన టీడీపీ నేతలకే కట్టబెట్టేందుకు పరిస్థితులను, అవకాశాలను అధికారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. టెండర్ల ఖరారు చేసి కట్టబెట్టిన వైనం చూస్తే ఇది స్పష్టమవుతోంది.

- అప్పారావుపాళెం రీచ్‌కు 6 సీల్డ్ టెండర్లు రాగా అందులో రెండు రిజెక్ట్ అయ్యాయి. మిగిలిన నాలుగు అర్హత సాధించాయి. ఇందులో ఓ ఎమ్మెల్యే సమీప బంధువు టన్ను ఇసుక లోడింగ్ రూ.4.90కు కోట్ చేశారు. మిగిలిన వారు బెస్ట్ ప్రైస్ రూ.25 వంతున కోట్ చేశారు. అక్కడ మాత్రం లాటరీ విధానం అమలు చేశారు. ఈ నాలుగులో మెజార్టీ టెండర్లు ఒకే సంస్థ వేయడంతో దానికే టెండర్ దక్కిందని సమాచారం.
- ఇక పల్లిపాడు రీచ్‌కు సంబంధించి 8 టెండర్లు రాగా మూడు రిజెక్ట్ కావడంతో ఐదు అర్హత సాధించాయి. ఇక్కడ కూడా బెస్ట్ ప్రైస్ టన్ను ఇసుక లోడింగ్‌కు రూ.25 నిర్దేశించగా సదరు ఎమ్మెల్యే బంధువు బినామీ భరణికుమార్ రూ.17.50కే టెండరు కోట్ చేయగా, మిగిలిన నలుగురు బెస్ట్‌ప్రైస్ రూ.25 వంతున కోట్ చేశారు. ఇక్కడ మాత్రం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి, బెస్ట్ ప్రైస్ కంటే తక్కువ ధరకు టెండర్ ఖరారు చేయకూడదనే నిబంధనను తోసిరాజేసి ఎమ్మెల్యే బంధువు బినామీకే కట్టబెట్టారు.

గతంలో టెండర్లు పిలిచి రద్దు చేసి..

గతంలో పెన్నానదిలో నాలుగు చోట్ల ఇసుక తవ్వకాలకు గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి తీసుకోకుండానే ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అప్పట్లో మినగల్లు, పడమటికంభంపాడు, పల్లిపాడు, విరువూరులో ఓపెన్ రీచ్‌ల ద్వారా 2.86 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులోకి తెచ్చేందుకు టెండర్లు ఆహ్వానించారు. ఆయా రీచ్‌లకు 23 మంది కాంట్రాక్టర్లు 43 దరఖాస్తులు దాఖలు చేశారు. ఒకటి జీఎస్టీ సక్రమంగా లేకపోవడంతో రద్దయింది. మిగిలిన దరఖాస్తులు అర్హత సాధించాయి. అయితే బెస్ట్‌ప్రైస్ కోట్ చేసిన టెండర్లను మాత్రమే లాటరీ విధానంలో కేటాయించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ఒక మంత్రి ఆదేశంతో అందరిని కలిపి లాటరీ ప్రక్రియను చేపట్టారు. దీంతో టీడీపీ వర్గీయులకు కాకుండా ఇతరులకు టెండర్ రావడంతో మరో మంత్రి భగ్గుమంటూ ఏకంగా టెండర్లనే రద్దు చేయించి, తమ పార్టీ నేతలకే నామినేషన్ పద్ధతిపై కట్టబెట్టించారు. దీంతో లాటరీలో రీచ్‌లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కోర్టుకెళ్లారు.

డీసిల్టేషన్ కాంట్రాక్టర్ల విషయంలోనూ అంతే

నెల్లూరు, సంగం బ్యారేజీల సమీపంలో డీసిల్టేషన్ ద్వారా ఇసుకను అందుబాటులోకి తెచ్చేందుకు సర్వేపల్లి, ఆత్మకూరు, కోవూరు నియోజకవర్గాల్లో డంపింగ్ యార్డులు పెట్టారు. రోజుకు ఆరు వేల టన్నులను సేకరించేలా నిర్ణయించారు. ఈ మేరకు రెండు నెలల క్రితం ఇరిగేషన్ అధికారులు టెండర్లను ఆహ్వానించారు. ఈ ప్రక్రియలో 15 మంది దరఖాస్తులు చేయడంతో అందరూ అర్హత సాధించినట్లు తేల్చిన అధికారులు అందరూ కలిసి డ్రెడ్జింగ్ ద్వారా తవ్వకాలు చేపట్టాలని అనుమతులు ఇచ్చారు. అయితే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చి తమ ముఖ్య అనుచరులకు ఆ మూడు డంపింగ్ యార్డులు అప్పగించేలా చేశారు. మిగిలిన వారికి అగ్రిమెంట్లు ఇవ్వకుండా రెండు నెలలుగా వేధిస్తున్నారు. ఇటీవల ఇరిగేషన్ అధికారులు అగ్రిమెంట్లు ఇచ్చారు. కానీ బోట్లు పెట్టుకునే ప్రదేశం చూపించలేదు. ప్రస్తుతం డంపింగ్ యార్డులకు ఇసుక రవాణా చేసే ఆ ముగ్గురు కాంట్రాక్టర్లు అర్హత లేని వారని, మిగిలిన కాంట్రాక్టర్లు హైకోర్టు కెళ్లడంతో వారిని ప్రొసిడింగ్స్‌ను తప్పించాలని న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఇరిగేషన్ అధికారులు మాత్రం కోర్టు ఉత్తర్వులు ఇచ్చిన తేదీ ముందు రోజే అగ్రిమెంట్లు ఇచ్చినట్లుగా తయారు చేసి కోర్టునే తప్పుదోవ పట్టించారు. కోర్టు ఉత్తర్వులను పక్కన పెట్టేశారు.

డ్రెడ్జింగ్.. టెండర్.. లాటరీ.. ఏదైనా తమ్ముళ్లకే!

జిల్లాలో ఇసుక తవ్వకాలకు సంబంధించి అనుమతులు డీసిల్టేషన్.. టెండర్లు, లాటరీ అయినా.. చివరాఖరుకు టీడీపీ నేతలకే కట్టబెడుతూ జిల్లాలో ఇసుక దోపిడీకి అధికార యంత్రాంగం ఇతోధికంగా సాయపడుతోంది. ఇసుక వ్యవహారంలో అధికారుల తీరు రోజు రోజుకు వివాదాస్పదంగా మారుతోంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి లేకుండా.. ఇలా ఇష్టారీతిన ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తూపోవడంతో రోజుకు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఈ స్థాయిలో ఇసుక తవ్వకాలు చేస్తున్నా.. జిల్లాలో మాత్రం ఇసుక కొరత వేధిస్తుండడం కొసమెరుపు.

వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోండి



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సతీష్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్

- భారత ఏరోనాటికల్ సొసైటీ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి

మర్రిపాడు: మండలంలోని ఖాన్‌సాహెబ్‌పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ శుక్రవారం డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, భారత ఏరో నాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు గుండ్రా సతీష్‌రెడ్డి, కలెక్టర్ ఓ ఆనంద్ ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన ఈ వాటర్ ప్లాంట్‌ను గ్రామీణ ప్రాంతాల ప్రజలతో పాటు దర్గాకు వచ్చే భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ ప్రాంతంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని స్థానికులు సతీష్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆయన కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రక్షణ మంత్రిత్వశాఖ సాంకేతిక సలహాదారులు గుండ్రా సతీష్ రెడ్డి పలు సమస్యలను తీసుకొచ్చారని, ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని, మర్రిపాడు ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్‌యాదవ్, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వైద్యుడి ఫిర్యాదుపై విచారణ


ఉదయగిరి: ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక వైద్య బృందం వైద్యశాలలో వైద్యులు, సిబ్బందిపై విచారణ చేపట్టారు. సీహెచ్‌సీలో పనిచేస్తున్న ఠాగూర్ వైద్యశాలలో పనిచేసే పలువురు వైద్యులు, సిబ్బందిపై ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణలో గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో కలెక్టర్‌కు నివేదిస్తామని విచారణ బృందం తెలిపింది. ఈ విచారణ బృందంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్, హెచ్‌ఓడీ నరేంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్ మస్తాన్‌బాషా, అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ ఏడుకొండలు, కార్యాలయ సూపరింటెండెంట్ బి.ప్రసన్నకుమార్ ఉన్నారు.



విచారణ చేస్తున్న ప్రత్యేక వైద్యబృందం

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖకుమార్



మాట్లాడుతున్న ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖకుమార్

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖకుమార్ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం ఆయన వివిధ మండలాల్లో జరుగుతున్న ఉపాధి పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జెడ్పీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, ఉపాధిహామీ సిబ్బందితో ఆయన సమీక్షించారు. డైరెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు సంబంధించి సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. పనుల వివరాలు, ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలను డిసెంబర్ 31వ తేదీలోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాంటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ గంగాభవాని, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమనకొండపై లలితా రుద్ర మహాయజ్ఞం



తిరుమనకొండ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

సంగం: సంగంలోని తిరుమనకొండపై కొలువైన రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడి–పంటలతో లోకకల్యాణం, విశ్వశాంతి, ధర్మ సంస్థాపనార్థం 45 రోజులుగా నిర్వహిస్తున్న లలితా రుద్ర మహాయజ్ఞం కార్తీక పౌర్ణమి శుక్రవారంతో పూర్తయింది. శివపార్వతులకు సకల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానంద స్వామితో పాటు వేద పండితులు లలితా రుద్ర మహాయజ్ఞం పూర్తి చేసి పూర్ణాహుతి సమర్పించారు. దశ మహా విద్యాదేవతలు లలితా సహస్రనామ, షోడశ లక్ష్మీ దేవతా మంత్రాలతో యజ్ఞం నిర్వహించినట్లు పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భజన బృందాలు ఆలపించిన గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం స్తోత్ర పారాయణం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ రాజుల కాలం నుంచి నిర్వహిస్తున్న యజ్ఞ యాగాదులు నేడు తిరుమనకొండలో నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం కోటి దీపార్చన నిర్వహించి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సోమ్లానాయక్, చెర్లోవంగల్లు భీమేశ్వరాలయ చైర్మన్ పగడాల రఘురామయ్య, వైద్యాధికారిణి దేవసేనమ్మ, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ నాయకులు గూడూరు కృష్ణారెడ్డి, అల్లూరు శేషారెడ్డి, భాస్కర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిల్లలను తీసుకెళ్లాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులోని బాలల వసతి గృహం సంరక్షణలో ఉన్న ఏడుగురు పిల్లలను తగిన సాక్ష్యాలను చూపించి తల్లిదండ్రులు తీసుకెళ్లాలని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సంరక్షణలో యు.మేరీ, ప్రేరణ, స్నేహ, చెంచమ్మ అలియాస్ లిథియా, అశ్వవర్థన్, సుబ్రహ్మణ్యం, తరుణ్ చిన్నారులు న్నట్లు వెల్లడించారు. 30 రోజుల్లోగా తీసుకెళ్లక పోతే వారిని అనాథలుగా ప్రకటించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తత ఇస్తామన్నారు. తల్లిదండ్రులు తగిన ఆధారాలతో ఏకే నగర్‌లోని రెవెన్యూ కాలనీలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 0861 - 2355477, 90007 89793 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

కావలి: బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో జలచిత్ర తస్లీమా (37)ను దారుణంగా హత్య చేసిన ఘటనలో ఆమె భర్త జలచిత్ర దత్తును అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వనాథరావుపేటలో నివాసం ఉంటున్న తస్లీమాపై అనుమానంతో ఆమె భర్త దత్తు ఈనెల 12వ తేదీ సాయంత్రం కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. దత్తుకి తస్లీమా రెండో భార్య. 2017లో మొదటి భార్య కరుణ చనిపోయింది. ఆ తర్వాత కరుణ చెల్లెలు శ్రావణిని మూడో వివాహం చేసుకున్నాడు. కాగా రెండో భార్యపై అనుమానంతో తరచూ గొడవపడేవాడు. 12వ తేదీ సాయంత్రం భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరగ్గా కత్తితో పొడిచి హత్య చేసి పారిపోయాడు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టగా ఉడ్‌హౌస్‌పేట క్రాస్‌రోడ్ జంక్షన్ వద్ద నిందితుడున్నట్లు సమాచారం రావడంతో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ పాపారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ వ్యాన్‌కు తప్పిన ప్రమాదం

నెల్లూరు సిటీ: విద్యార్థులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ స్కూల్ వ్యాన్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. రూరల్ మండలంలోని ఓ పాఠశాల వ్యాన్ శుక్రవారం మాదరాజుగూడూరు నుంచి ముత్తుకూరు మండలం బ్రహ్మదేవి మధ్యలో వెళ్తోంది. ఈ క్రమంలో ముందు వెళ్తున్న లారీని డ్రైవర్ ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించాడు. అయితే అదుపు తప్పిన వ్యాన్ లారీని ఢీకొంది. దీంతో దాని అద్దాలు ధ్వంసమయ్యాయి. అందులోని చిన్నారులు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వ్యాన్ డ్రైవర్ అతి వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ముక్కంటికి ప్రణమిల్లి..

ముక్కంటికి భక్తజనం ప్రణమిల్లింది. శైవక్షేత్రాల్లో శివ నామస్మరణ మార్మోగింది. శుక్రవారం పవిత్ర కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆదిదంపతులు కొలువైన ప్రతి ఆలయంలోనూ భక్తులు కిక్కిరిశారు. నెల్లూరులో గణేష్ ఘాట్ వద్ద లక్ష దీపోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి భక్తకోటి విచ్చేసి పరవశించారు.

– సాక్షి నెట్‌వర్క్/ఫొటోగ్రాఫర్, నెల్లూరు


నెల్లూరు స్వర్ణాల చెరువులో ఏర్పాటు చేసిన మహా శివలింగం


హారతి ఇస్తున్న వేదపండితులు


గణేష్ ఘాట్ వద్ద శివలింగానికి అభిషేకం


మూలాపేట శివాలయంలో దీపం వెలిగించిన యువతి


సంగం: సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో..


దేవతామూర్తుల విగ్రహాలు


మైపాడు తీరంలో మహా శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


సీతారామపురం: భైరవకోనలో భక్తులు


నెల్లూరులో కోలాటం ఆడుతూ..


గణేష్ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన దేవుళ్ల ప్రతిమలు

మద్యం షాపును తొలగించాలంటూ..

- 11వ రోజుకు చేరిన ఆందోళన


మద్యం దుకాణం సమీపంలో ఆందోళన చేస్తున్న స్థానికులు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు పరమేశ్వరినగర్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని స్థానికులు చేపట్టిన ఆందోళన శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. జనవాసాలు, దర్గా, పాఠశాలకు సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల తమ ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎక్సైజ్ అధికారులతోపాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికల ఆందోళనకు వివిధ సంఘాల నాయకులు, మైనార్టీ నాయకులు మద్దతు ప్రకటించారు.

ఇతర జిల్లాల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల దిగుమతి


మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్కిల్ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 40 ట్రాన్స్‌ఫార్మర్లను జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నారు. ఈ మేరకు జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ శుక్రవారం కర్నూలుకు వెళ్లి అక్కడి ఎస్ఈ ఉమాపతిని కలిసి చర్చించారు. 25 కేవీఏ సామర్థ్యం కలిగిన 20 ట్రాన్స్‌ఫార్మర్లను అక్కడి నుంచి, నంద్యాల జిల్లా నుంచి మరో 20ని నెల్లూరుకు తరలించారు.

42 సవర్ల బంగారు ఆభరణాల చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంటి తాళాలను పగులగొట్టి బీరువాలోని బంగారు ఆభరణాలను గుర్తుతెలియని దుండగులు చోరీ చేసిన ఘటన నెల్లూరులోని గుర్రాలమడుగు సంఘంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుర్రాలమడుగు సంఘంలో విజయకుమారి కుటుంబం నివాసం ఉంటోంది. ఆమెకు రెండు గృహాలు పక్కపక్కనే ఉన్నాయి. వాటిని వినియోగించుకుంటున్నారు. విజయకుమారి కొత్తూరు అంబాపురంలోని పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. గురువారం రాత్రి రేకుల ఇంటికి తాళం వేసి కుమార్తెలతో కలిసి మరో ఇంట్లో నిద్రపోయారు. శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు రేకుల ఇంటి తాళం తెరిచి లోనికి ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న 42 సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఉదయం నిద్ర లేచిన విజయకుమారికి బీరువాలోని నగలు కనిపించకపోవడంతో చోరీ ఘటనపై బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్కడైనా తాగిస్తాం


ముత్తుకూరు రోడ్డులోని ఓ మద్యం దుకాణం వెనుక వైపు ఇలా..


నెల్లూరులో పరదాల మాటున సిట్టింగ్ రూమ్

- ఇష్టారాజ్యంగా బెల్టు షాపుల ఏర్పాటు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): కూటమి ప్రభుత్వం ప్రజల జీవితాలతో ఆడుకుంటోంది. అధికార పార్టీ నాయకుల తీరు కారణంగా మద్యం ఏరులై పారుతోంది. జిల్లాలో బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ప్రతి మద్యం దుకాణానికి పక్కనే కూల్‌డ్రింక్ షాపుల ముసుగులో సిట్టింగ్ రూమ్‌లు ఏర్పాటయ్యాయి. కొందరు బార్ల నిర్వాహకులు సమయపాలనకు నీళ్లొదిలి యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎక్సైజ్ అధికారులు మొక్కుబడి చర్యలకు పరిమితమవుతున్నారు. బెల్టుషాపులు, అక్రమ మద్యం అమ్మకాలను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినా జిల్లా ఎక్సైజ్ అధికారుల్లో కనీసం చలనం లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మార్కెట్లోకి న్యూ డిజైర్ కారు


కారు వద్ద ఈడీ, జీఎం తదితరులు

నెల్లూరు(టౌన్): మారుతి సుజుకి కంపెనీకి చెందిన న్యూ డిజైర్ కారును జెడ్ సీరీస్ ఇంజిన్‌తో మార్కెట్లోకి విడుదల చేశారు. స్థానిక భార్గవి ఆటోమొబైల్స్ షోరూంలో శుక్రవారం రవాణా శాఖ మోటారు వాహనాల అధికారి ఎండీ రఫీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతరం మెచ్చేలా న్యూ డిజైర్ కారును అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. భార్గవి ఆటోమొబైల్స్ షోరూం చైర్మన్ కొండా బలరామిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కొండానిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రికల్ సన్‌రూఫ్, ఎల్ఈడీ క్రిస్టల్ విజన్ హెడ్ ల్యాంప్స్, 360 డిగ్రీల హెచ్‌డీ వ్యూ కెమెరా తదితర ఫీచర్స్ ప్రత్యేకతలన్నారు. ఏడు రంగుల్లో లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈడీ కొండా నిరంజన్‌రెడ్డి, జీఎం రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 100
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 186
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 210
లేయర్ చికెన్	: 187

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.45
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.20

పేకాట కేంద్రంపై దాడి

- నిర్వాహకురాలు, ఐదుగురు జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): జనావాసాల నడుమ గుట్టుచప్పుడుగా నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై నెల్లూరు నవాబుపేట పోలీసులు దాడిచేశారు. నిర్వాహకురాలు, ఐదుగురు జూదరులను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. భగత్‌సింగ్‌కాలనీ మూడు జెండాల సెంటర్‌లో అరుణ అనే మహిళ కొంతకాలంగా కమీషన్ పద్ధతిపై తన ఇంట్లో పేకాట ఆడిస్తోంది. శుక్రవారం సమాచారం అందుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిర్వాహకురాలితోపాటు పేకాట ఆడుతున్న పెంచలయ్య, నాగరాజు, దేముడు నాయుడితోపాటు ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.45 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో స్థానిక ఎస్సై కె.శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చూపి.. పతకాలు సాధిస్తూ..

- అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న కోవూరు బాలుడు
- 2019లో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం
- ప్రభుత్వ స్పోర్ట్స్ హాస్టల్లో అడ్మిషన్
- సౌత్‌జోన్ నేషనల్స్‌లో బంగారు పతకం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కొందరు పిల్లలు విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారిస్తున్నారు. ఓ వైపు తరగతి గదిలో పాఠాలు నేర్చుకుంటూనే.. మరోవైపు మైదానంలో సాధన చేసి పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు. అలాంటి వారిలో ఒకడే పెంచలబాబు. ఇతడిది కోవూరు మండలంలోని లేగుంటపాడు. రోజూ తెల్లవారుజామున మూడు గంటలకు నిద్రలేచి నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియానికి క్రమం తప్పకుండా వచ్చేవాడు. ఆటో, బస్సు, లేదా ఎవరైనా లిఫ్ట్ ఇస్తే కచ్చితంగా 5 గంటలకు చేరుకుని సాధన చేసేవాడు.


సాధించిన పతకాలతో పెంచలబాబు


సాధన చేస్తున్న పెంచలబాబు

ఆసక్తిని గమనించి..

పెంచలబాబు తండ్రి పొక్లెయినర్ డ్రైవర్. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం. కానీ బాలుడికి క్రీడలపై ఆసక్తి ఉంది. రోజూ అంత దూరం నుంచి స్టేడియానికి వస్తూ.. పోతూ క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవడంలో చూపే శ్రద్ధ పలువురిని ఆకర్షించింది. పెంచలబాబు చదువుతోపాటు క్రీడలకు అవసరమయ్యే సదుపాయాలను కల్పించేందుకు ఖోఖో అసోసియేషన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ నాయకులు ముందుకొచ్చారు. ఆర్థికంగా స్తోమత లేకపోయినా క్రీడల పట్ల అతడికున్న ఆసక్తి, శ్రద్ధ పలు అవార్డులను కైవశం చేసుకునేలా చేసింది.

14 టోర్నమెంట్లలో..

పెంచలబాబుకు కోచ్ సుకుమార్ 2019 సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో ఖోఖోలో మెలకువలు నేర్పించారు. అదే ఏడాది స్పోర్ట్స్ హాస్టల్‌కు రాష్ట్రస్థాయిలో ఎంపికలు జరిగాయి. ఆ బాలుడు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించాడు. డాక్టర్ వైఎస్సార్ కడప స్పోర్ట్స్ హాస్టల్లో సీటు సాధించాడు. అప్పటి నుంచి అతను జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. ఇప్పుడు పెంచలబాబు వయసు 14 ఏళ్లు. రాష్ట్ర స్థాయిలో 14 టోర్నమెంట్లలో ఆడాడు. ఏడుసార్లు ప్రథమ, ఏడుసార్లు ద్వితీయ స్థానాల్లో నిలిచాడు. ఇటీవల గుంటూరులో జరిగిన 35వ సౌత్‌జోన్ నేషనల్స్ –2024 ట్రిట్లాన్ గ్రూప్‌సీ (600మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, స్విమ్మింగ్‌లో పాయింట్ల ఆధారంగా మార్కులను నిర్ణయిస్తారు) కేటగిరీలో బంగారు పతకం సాధించాడు.

ఆసక్తి వల్లే గుర్తింపు వచ్చింది



చిన్న వయసులోనే పెంచలబాబు క్రమం తప్పకుండా అంతదూరం నుంచి స్టేడియానికి వచ్చేవాడు. అతనిలోని ఆసక్తి వల్లే నేడు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లభించింది. టోర్నమెంట్లకు వెళ్లేందుకు ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గిరిప్రసాద్, గురుప్రసాద్, స్టేడియం సూపరింటెండెంట్ విజయ్‌కుమార్‌లు ఆర్థిక సాయం అందించారు.

– సుకుమార్, డీఎస్‌ఏ కోచ్

ప్రోత్సహిస్తాం



స్టేడియానికి వచ్చే చిన్న పిల్లల్లో ప్రతిభను ముందే గుర్తిస్తాం. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే వారు ఏ క్రీడకు చెందిన వారైనా తప్పక ప్రోత్సహిస్తాం. క్రీడలతో భవిష్యత్‌లో అవసరమయ్యే ప్రతి అంశంపై శ్రద్ధ తీసుకుంటాం.

– ఆర్‌కే యతిరాజ్, డీఎస్‌డీఓ

అసోసియేషన్ తరఫున ప్రోత్సహించాం



పెంచలబాబును మా అసోయేషన్ తరఫున ప్రోత్సహించాం. అతడికి అన్నివిధాలా అండగా నిలిచాం. స్పోర్ట్స్ హాస్టల్లో ఉన్నప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే పోటీల్లో మంచి ఫలితాలను సాధిస్తున్నాడు. ఆర్థికంగా వెనుకబడిన క్రీడాకారులకు అండగా ఉంటాం.

– అరిగెల విజయకుమార్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి

అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తా

ఎప్పటికైనా నా అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధిస్తాను. మొదటి నుంచి నన్ను అందరూ ప్రోత్సహించారు. ఇప్పుడు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు అవకాశాలు మెరుగయ్యాయి. క్రీడల్లో రాణించి మా కుటుంబానికి అండగా ఉంటాను.

– పెంచలబాబు, అథ్లెట్

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.